క్లుప్తంగా

శ్రీమహాకాళేశ్వర రూపంలో శ్రీరామలింగేశ్వరస్వామి



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో గురువారం ఉజ్జయని శ్రీ మహాకాళేశ్వర స్వామి దర్శనమిచ్చారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారిని ఉజ్జయని శ్రీమహాకాళేశ్వర రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఉదయం 11.30 గంటలకు భస్మాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెండి త్రిశూలం బహూకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారికి భక్తులు వెండి త్రిశూలం బహూకరించారు. విజయవాడకు చెందిన దంమూడి స్టాలిన్‌బాబు, స్వర్ణకుమారి దంపతులు 2 కేజీల వెండి త్రిశూలం ఆలయ పూజారి సాగర్‌కు గురువారం అందజేశారు.

తాగునీటి ప్లాంట్‌లో సాంకేతిక లోపం

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడిచే తాగునీటి ప్లాంటులో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా కొన్ని రోజులుగా తాగునీటి ప్లాంటు మూతబడింది. గ్రామస్తులు ఈ సమస్యను ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే మరమ్మతులు నిర్వహించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే వంశీ సూచించారు.

నేటి నుంచి పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దావులూరు, 28న ఈడుపుగల్లు-1, 29న ఈడుపుగల్లు-2, 30న గొడవర్రు, డిసెంబరు 1న మంతెన, 4న గొల్లగూడెం, 5న ఉప్పలూరు, 6న వేల్పూరు, 7న ప్రొద్దుటూరు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబాపురంలో...

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కె.సువర్ణరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొంటారని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో గురువారం జాతీయ రహదారితో పాటు ప్రధాన గ్రామంలో సైడు డ్రెయిన్లను పూడిక తీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణ పనుల్లో భాగంగా జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, హైవేపై పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్నట్లు వెల్లడించారు. అంతర్గత రహదారుల్లోని చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందిచే తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగునిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారి చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నామని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరులో కాలేజీకి వెళ్లిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యం అవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సిద్ధిక్‌నగర్‌లో భార్యభర్తలు సైకం నాగలక్ష్మి, నరేంద్రబాబు నివసిస్తున్నారు. నరేంద్రబాబు మెకానిక్‌గా పని చేస్తాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా రెండవ కుమార్తె(17) మాచవరంలోని ఒక కాలేజీలో ఇంటర్ చదువుతోంది. తండ్రి నరేంద్రబాబు కుమార్తెను ప్రతి రోజూ ఆటోనగర్‌లో బస్సు ఎక్కించి కాలేజీకి పంపుతాడు. ఈ క్రమంలో బుధవారం కూడా కుమార్తెను బస్సు ఎక్కించి కాలేజీకి పంపాడు. అయితే సాయంత్రం కుమార్తె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఫ్రెండ్స్‌ని, కాలేజీలోనూ విచారించినా కుమార్తె జాడ తెలియలేదు. తమ కుమార్తె కనిపించడంలేదని తల్లి నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



చిన అవుటపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు



యనమలకుదురు సచివాలయం-4లో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి



కోలవెన్నులో సంక్షేమాభివృద్ధి బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనమలూరు: పేద ప్రజలందరికీ సమర్థవంతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ ఎస్ విజయలక్ష్మి అన్నారు. యనమలకుదురు సచివాలయం-4లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలను ప్రభుత్వం గుర్తించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి అవినీతికి తావు లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సచివాలయం-4లో గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో మొత్తం రూ. 38.2 కోట్లు నేరుగా పేదల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కర్రా ఆదిశేషారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు క్షేమంగా ఉన్నారని తెలియజేశారు. సీఎం జగన్‌ని వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యార్లగడ్డ నాగబాబు, లంకా కోటేశ్వరరావు, షేక్ లతీఫ్, సీహెచ్ రమణ, షేక్ సమ్మద్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగూరులో...

గంగూరు-2 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వం గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం...

హనుమాన్‌జంక్షన్ రూరల్: అర్హులైన ప్రతి పేదవాడికి కుల, మత, రాజకీయ పక్షపాతం లేకుండా ఇంటింటికీ సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రామ సచివాలయం-2 ప్రాంగణంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. శేషగిరిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు గ్రామగ్రామాన నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ భవనాలు, మనబడి నాడు-నేడు పనులే నిదర్శనమని చెప్పారు. సచివాలయం-2 పరిధిలో గడిచిన నాలుగున్న ఏళ్లలో లబ్ధిదారులకు డీబీటీ రూ. 16.56 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7.60 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యులు దూసరి నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, మాజీ చైర్మన్ గూడవల్లి రత్నసుధాకర్, పార్టీ నాయకులు బాబి, ఆత్మూరి బాలాజీ, మొర్ల ఆంజనేయులు, రాయి శివపార్వతి, గండి చిన్నారావు పాల్గొన్నారు.

చిన అవుటపల్లి గ్రామంలో....

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాల్లో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనముందు నిలిపారని చెప్పారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, స్థానిక సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గంతోటి ప్రశాంతి, కోట రాజకుమారి, దగాని ఇస్సాక్, ఎంపీడీవో సత్యకుమార్, గోగులమూడి దుర్గారావు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం ...

కంకిపాడు: జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం జరిగింది. గ్రామ సచివాలయం ప్రాంగణంలో సంక్షేమాభివృద్ధి బోర్డు ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయం ఎదుట పార్టీ జెండా ఎగురవేశారు. బాకీ బాబు మాట్లాడుతూ అన్ని వర్గాలకూ సంక్షేమాన్ని చేరువ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి పాలన కొనసాగాలంటే రాష్ట్రానికి మరోసారి సీఎం జగన్ కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ చోరగుడి సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కంచర్ల శేషగిరి, పార్టీ నేత కొలుసు లక్ష్మణ్, ఈడ సువర్ణలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కి మించి ప్రభుత్వ పాఠశాలలు



వంట పాత్రలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చి, కార్పొరేట్ స్థాయికి మించి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. స్థానిక మహాత్మ గాంధీ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'జగనన్న గోరుముద్ద' పథకం కింద మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కావాల్సిన వంట పాత్రలను గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వరంగ విద్యా సంస్థలను బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. మనబడి నాడు-నేడు, అమ్మఒడి, ఇంగ్లీష్ మీడియం, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, మెరుగైన మౌలిక సదుపాయాలను వైఎస్ జగన్ కల్పిస్తున్నారని చెప్పారు. బాపులపాడు ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 65 ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంఈవో-2 బి.సురేష్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలు రైతాంగం వినియోగించుకోవాలి



ఆర్బీకే వద్ద రైతులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఏవో తేజస్వి

గన్నవరం రూరల్: రైతు భరోసా కేంద్రాల సేవలను రైతాంగం వినియోగించుకోవాలని ఎంఏవో ఎస్ఎల్ తేజస్వి అన్నారు. కొండపావులూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రికార్డులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. రైతులతో మాట్లాడుతూ గ్రామంలోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, కనీస మద్దతు ధర కన్నా తక్కువకు పంటను అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతాంగం నష్టపోకూడదని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ. 2183, గ్రేడ్-ఎ రకం క్వింటాకు రూ. 2203 ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మార్కెటింగ్ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది రైతులకు నిరంతరం సేవలందిస్తారని, కొనుగోలు కేంద్రాలను రైతాంగం వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు

కంకిపాడు: అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పట్టణంలోని పాశం లక్ష్మణస్వామి నగర్‌లోని 12 అంతర్గత రహదారులను రూ. 15 లక్షల అంచనా వ్యయంతో సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేసే పనులు గురువారం చేపట్టారు. రోడ్డు పనులకు చిరంజీవి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు సమర్థంగా వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఈడ రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, వైఎస్సార్ సీపీ నేతలు బాకీ రాకేష్, చంటి, రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం బాపులపాడు మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. స్థానిక రైతుబజార్ వీధిలోని దయాల షడ్రక్ మెమోరియల్ స్కూల్లో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా బీజే సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ సునాథ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా డి.విద్యాసాగర్, ఎన్నికల అధికారిగా ఎం.ఆనంద్‌కుమార్ వ్యవహరించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు, సీనియర్ నాయకులు దయాల శామ్యూల్‌ప్రసాద్, జిల్లా కౌన్సిలర్లు ఎం.శివగాంధీ, ఎస్ సువర్ణలత, బి.రాజశేఖర్, కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సమర్థంగా చర్యలు



కంకిపాడు: ధాన్యం సేకరణ సమర్థంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి పీఎం.కిరణ్ అన్నారు. మండలంలోని కోలవెన్ను, కుందేరు, నెప్పల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ధాన్యం రవాణాకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు, వాటి తేమ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోత కోసిన ధాన్యం తేమ శాతం తక్కువగా ఉంటే రైతులకు మంచి ధర లభిస్తుందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం మిల్లులకు తరలింపులో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి, పంట మిల్లులకు చేరేలా చూస్తున్నామని వివరించారు. కలకోట లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వీఆర్‌ఓ రఘురాంప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పార్టీ రంగు పులమడం తగదు



తరిగొప్పలలో రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్(ఫైల్)

ఉంగుటూరు: సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవాల్సిన టీడీపీ నాయకులు ప్రజా సమస్యలకు పార్టీ రంగు పులమడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి(నాని) అన్నారు. ఉంగుటూరు మండలం తరిగొప్పలలో రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే స్థలంలో ఎన్నో ఏళ్లుగా పేదలు నివాసం ఉంటున్నారు. ఇటీవల రైల్వే అధికారులు వాటిని ఖాళీ చేయాలని హడావిడి చేయడంతో నిర్వాసితులు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌లకు తమ సమస్యను విన్నవించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వంశీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని పరిశీలించి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇళ్లు ఖాళీ చేయకుండా తాత్కాలికంగా నిలిపివేశారు. ఇళ్లు కోల్పోయేవారికి మరో చోట ప్రత్యామ్నాయం చూపే వరకు వారిని ఖాళీ చేయించవద్దని రైల్వే ఉన్నతాధికారులను కోరడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. అయితే గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు తరిగొప్పల సమస్యను రైల్వే అధికారుల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తానే నిర్వాసితులకు అండగా ఉన్నట్లుగా ఎల్లో మీడియా ద్వారా కలరింగ్ ఇవ్వడం హాస్యాస్పదం అని ఆదినారాయణరెడ్డి అన్నారు. సమస్యలను మానవతాదృక్పథంతోనే చూడాలని పార్టీల రంగుపులిమి ఎన్నికల్లో గట్టెక్కాలని చూడడం తగదని పేర్కొన్నారు.

అన్నదాతలకు ప్రభుత్వం అండ



రైతులకు డివిడెండ్ అందజేస్తున్న ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్

గన్నవరం: అన్నదాతలకు జగనన్న ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీ సీతారామాంజనేయ కో-ఆపరేటివ్ సొసైటీలో డివిడెండ్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ చిమట శ్రీనివాసరావు అధ్యక్షతన 1,157 మంది రైతులకు రూ. 10.61 లక్షల డివిడెండ్ నగదును అందజేశారు. తమ సొసైటీ ద్వారా రైతులకు రూ. 18.69 కోట్ల రుణాలను అందజేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ రైతు భరోసా పథకంతో ప్రభుత్వం అన్నదాతలకు ఆర్థిక తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఆర్బీకేల ద్వారా విత్తన సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు అన్ని రకాలు సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పీఏసీఎస్‌లను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలోపేతం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అన్నదాతలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ జాస్తి శేషగిరిరావు, సొసైటీ సభ్యుడు జలసూత్రం నరసింహారావు పాల్గొన్నారు.

యాంటి బయాటిక్‌పై అప్రమత్తత అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో యాంటి బయాటిక్స్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని చెప్పారు. శరీరానికి హానికరమైన మందులు, పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసు మాట్లాడుతూ యాంటి బయాటిక్స్‌ను తగిన మోతాదులోనే ఉపయోగించాలని తెలిపారు. మోతాదు మించితే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. ఆరోగ్య అధికారులు డాక్టర్ ముక్తర్, సహాయ సంచాలకుడు డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి, పశువైద్యులు డాక్టర్ జీ.సుధీర్‌బాబు, హెచ్‌ఎం.రజనీ తదితరులు పాల్గొన్నారు.

నగర మార్కెట్లోకి టాటా నూతన ట్రక్కు



వాహన తాళాలు అందజేస్తున్న గిరీష్ వాఘ్

రామవరప్పాడు: టాటా మోటార్స్ లిమిటెడ్ నూతనంగా రూపొందించిన ప్రైమా 2830 టీకేవీఎక్స్ టిప్పర్ వాహనాన్ని ఆ సంస్థ వాణిజ్య వాహనాల ప్రెసిడెంట్ గిరీష్ వాఘ్ జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరీష్ మాట్లాడుతూ ఈ వాహనాన్ని నిర్మాణ రంగం అవసరాలకు తగ్గట్టుగా రూపొందించారన్నారు. ప్రైమా 2830 టీకేవీఎక్స్ ప్రత్యేకతలను వివరించారు. అనంతరం సజ్జా నితిన్ చక్రవర్తికి మొదటి వాహనం తాళాలు అందజేశారు. కార్యక్రమంలో జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బాడిగ సుమంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు.

ప్రారంభమైన అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం



నున్న(విజయవాడరూరల్): నున్న శివారు బోడపాడులోని శ్రీభద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాలను అర్చకస్వాములు గురువారం గోపూజతో ప్రారంభించారు. అనంతరం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రుత్విగ్వరణం, రక్షాబంధనం, అకల్మష హోమం, వాస్తుహోమాలను నిర్వహించారు. సాయంత్రం అగ్నిమథనం, సర్వాగ్నికుండేషు అగ్ని ప్రణయనం, కళాపకర్షణం, కళాపకర్షణ హోమం, యాగశాల నందు కుంభాస్థాపనం నివేదన, హారతి కార్యక్రమాలు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం చేశారు. ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేసి ఆశీస్సులు పొందారు.

రేవంత్‌రెడ్డి ముస్లిం మనోభావాలను కించపరిచారు

రామవరప్పాడు: ముస్లిం మనోభావాలను కించపరుస్తూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించడం బాధాకరమని ముస్లిం రైట్స్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామవరప్పాడులోని ముస్లిం రైట్స్ వెల్ఫేర్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో ఒక ముస్లిం సోదరుడు ముస్లిం సంప్రదాయంలో భాగమైనటువంటి టోపీని రేవంత్ రెడ్డి తలకు పెడుతున్న సందర్భంలో ఆ టోపీను తీసివేసి ముస్లిం సోదరుడిని పక్కకు నెట్టి వేసి ముస్లింల మనోభావాలను కించపరిచారన్నారు. రేవంత్‌రెడ్డిని టీపీసీసీ పదవి నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని కోడూరుపాడు, హనుమాన్‌జంక్షన్ భగవాన్ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సత్యసాయి బాబా వత్రం, నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, కోడూరుపాడు మాజీ సర్పంచ్ గరికపాటి రామకృష్ణ, సభ్యులు యనమదల రామదాసు, నండూరు సాయివేణుగోపాల్, సుకుమార్, భవాని, చలసాని రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

శరణు శరణు దుర్గా భవానీ..

ఇంద్రకీలాద్రిపై గురువారం కనకదుర్గమ్మ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల తర్వాత మాలధారణ జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. మాలధారులు జై భవానీ.. జైజై భవానీ అంటూ నామస్మరణ చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



